క్లుప్తంగా

వైఎస్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా



పేరెంట్స్ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని కొవ్వూరు రోడ్డులోని ఎంపీపీ స్కూల్ పేరెంట్స్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన పూలపల్లి పద్మ ప్రమీల పేర్కొన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం సన్మానించారు. కొందరు వ్యక్తులు ఎన్ని పైరవీలు చేసినప్పటికీ తమ విజయాన్ని అడ్డుకోలేకపోయారని, వైఎస్సార్ సీపీ పాలనలోని విద్యావ్యవస్థ పట్ల తల్లిదండ్రులలో విశ్వసనీయత ఉందనడానికి తన విజయం కారణంగా నిలిచిందని పద్మ ప్రమీల తెలిపారు. వైస్ చైర్మన్ బొబ్బర రమేష్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజవరంలో పొలంబడి



ఊడ్పుల విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏవో

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో మేలైన యజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమం శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఎస్ చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. నారు వేసే కాలం నుంచి కోతలు కోసి పంటను భద్రపరచుకొనే విధానం వరకు రైతులకు వివరించారు. ఏఓ మడుల్లోకి దిగి వరి నారు ఊడ్పుల విధానంపై అవగాహన కల్పించారు. వరిలో మేలైన యజమాన్య పద్ధతులను వివరించారు. పంట కోత సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేత, ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. పంటలకు మేలు చేయు క్షీరధాలను రక్షించుకునే విధానం తెలిపారు. వ్యవసాయ విస్తరణశాఖ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది, 30 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన

కొయ్యలగూడెం: డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం కొయ్యలగూడెం, బయ్యనగూడెం పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించారు. బయ్యనగూడెం సచివాలయం–2 పరిధిలో ఆరోగ్య విస్తరణాధికారి ఎల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి తిరుగుతూ దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలోనే ఎక్కువగా వ్యాధులు ప్రబలడానికి గల కారణాలను వివరించారు. కొయ్యలగూడెం ఎన్టీఆర్ నగర్లో డ్రైడే కార్యక్రమాన్ని పీహెచ్‌సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించారు. అవగాహన ర్యాలీని సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి ప్రారంభించారు. వైద్యాధికారులు బి.ఎస్తేరురాణి, ఎస్ మంగారావు, కె.మోహన్, పి.పద్మావతి, ఎం.నాగమణి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

కుక్కునూరు: భారీ వర్షం దాటికి రెడ్డిగూడెం గ్రామంలోని పెదవాగు పొంగి ఇల్లు నీట మునగడంతో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు పూరం సంజీవరావు, ఏఎస్పీ నాయకులు పైదా పరమేష్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు ఇది అనువైన ప్రాంతం

జంగారెడ్డిగూడెం: సహజ ప్రకృతి వనరులకు నెలవైన జంగారెడ్డిగూడెం చిన్న సినిమాలకు అనువైన ప్రాంతమని జిల్లా జెడ్పీటీసీల చాంబర్ ప్రెసిడెంట్, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ మెంబర్ పోల్నాటి బాబ్జి అన్నారు. స్థానిక సాయి బాలాజీ టౌన్ షిప్‌లో శుక్రవారం శ్రీ వర్మ మూవీ క్రియేషన్స్ అధినేత, అనన్య చిత్ర దర్శకుడు బి.ప్రసాద్‌రాజు నూతన ప్రొడక్షన్ కార్యాలయాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు చామర్తి శ్రీరాములు (టెక్స్ మో), డైరెక్టర్ చాంబర్‌ను బాబ్జి ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన అవసరం

చింతలపూడి: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు విద్యార్థులకు సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీఓ మాధవి, సోషల్ వర్కర్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం రాజద్రోహమే



జంగారెడ్డిగూడెం : బస్టాండ్‌సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న విజయరాజు, నాయకులు



కామవరపుకోట : కొత్తూరు బస్టాండ్ ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న విజయరాజు, శ్రేణులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు

జంగారెడ్డిగూడెం: భారత రాజ్యాంగా నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం రాజద్రోహమే అని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. క్షీరాభిషేకం చేశారు. ఇక్కడ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో విజయరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీనికి కారకులైన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడకు వన్నె తెచ్చేలా భారత రాజ్యాంగ నిర్మాతను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తలంచి రూ.440 కోట్లతో ప్రపంచంలోనే అతి పెద్దదైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. భారదేశానికే గర్వకారణంగా అంబేడ్కర్ స్మృతి వనాన్ని నిలిపారని వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ ఉగ్గంప్రసాద్, లోకారపు వెంకటేశ్వరరావు, నేకూరి కిషోర్, మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు బత్తిన చిన్న, అలుగు ఆనందశేఖర్, ముప్పిడి శ్రీనివాసరావు, పంతగాని వెంకన్న, కంచర్ల విష్ణు, ముప్పిడి శ్రీను, షేక్ అక్బర్, షేక్ జిలాని, గెద్దాడ శ్రీను, షేక్ అమీర్, కాసర వెంకటరెడ్డి, కబీర్, జహీర్, దోసేపూడి రమణ, వీరవల్లి సోమేశ్వరరావు, కత్తి వసంత్, మేడపాటి వెంకటరెడ్డి, మాకరబోయిన మురళి, కల్యాణ్‌వర్మ, యర్రోజు సర్వేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహంపై దాడి హేయం

కామవరపుకోట: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. దాడికి నిరసనగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళిత నాయకులతో కలిసి స్థానిక కొత్తూరు బస్టాండ్ ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నిరసన వ్యక్తం చేసి, దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ రెడ్ బుక్కు రాజ్యాంగ నడుస్తోందని, అల్లర్లు సృష్టించి దాడులు చేయడం ఇకనైనా మానుకోవాలని అన్నారు. మూడు నెలల కూటమి పాలనతో ప్రజలు విసుగు చెందారని తెలిపారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన, హోం మంత్రి దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో సాయన కనకరాజు, భాగ్యరాజు, రాయంకుల సత్యనారాయణ, మేడంకి చిన్న, మేరుగు బాబురావు, నల్లూరి ప్రభాకర్ రావు, మేడంకి బుజ్జిబాబు, చింతపల్లి సుధా, బందేల ప్రభాకర్, యాదాద్రి పీటర్, గుల్లా శ్రీను, అప్పారావు, మానుకొండ బాబురావు, సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో సివిల్ సప్లయిస్, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పట్టణంలో ఒక వ్యాన్‌లో 1500 కేజీల బియ్యాన్ని మ్యేడం నవీన్‌కుమార్, మామిడాల సుబ్రహ్మణ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ బియ్యం కన్నాపురంలోని గ్రంధి శ్రీనివాస్‌కు అమ్మేందుకు తీసుకువెళుతున్నట్టు గుర్తించారు. నవీన్‌కుమార్‌కు చెందిన కిరాణా దుకాణంపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 125 గ్యాస్ సిలిండర్లు, 180 కేజీల రేషన్ బియ్యం, 43 కేజీల రేషన్ పంచదార, 90 లీటర్ల తెల్ల కిరోసిన్, 17 గ్యాస్ సిలిండర్‌లు స్వాధీనం చేసుకున్నారు. నవీన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సివిల్ సప్లయిస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా ద్విచక్ర వాహనాలపై 240 కేజీల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న గుండుమోలు నాగేశ్వరరావు, దాసరి తాతాజీల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దాడుల్లో డీఎస్ఓ రుద్రరాజు సత్యనారాయణరాజు, ఏఎస్ఓ ప్రతాపరెడ్డి, డీటీ వైవీ లక్ష్మీకుమారి, ఎస్సై జి.జ్యోతిబాస్, లీగల్ మెట్రాలజీ అధికారి ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు. లక్ష్మీకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ చెప్పారు.

బుద్ధదేవ్ మృతిపై సీపీఐ సంతాపం

కొయ్యలగూడెం: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఐ మండల శాఖ శుక్రవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించింది. కన్నాపురం రోడ్డులోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేతలు బి.వెంకటేశ్వరరావు, జమ్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు నాన్ స్టాప్ బస్సు నడపాలి



ఆర్టీసీ డిపో అధికారికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం – విజయవాడ మధ్య ఆర్టీసీ నాన్‌స్టాప్ సర్వీసు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వ్యాపారస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జంగారెడ్డిగూడెం పట్టణ బీజేపీ అధ్యక్షుడు, ఆర్టీసీ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ కొప్పాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో అధికారికి వినతిపత్రం అందజేశారు. జంగారెడ్డిగూడెం నుంచి ఎక్కువమంది విద్యార్థులు విజయవాడ, పరిసర ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్నారని, జంగారెడ్డిగూడెం, చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యాపారాలు ఖరీదు నిమిత్తం నిత్యం విజయవాడ వెళ్లి రావాల్సి వస్తోందని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడకు నాన్‌స్టాఫ్ బస్సు నడిపితే వారి ఇబ్బందులు తొలగుతాయని వివరించారు. ఉదయం, సాయంత్రం నాన్‌స్టాఫ్ సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఇనగడుపు సతీష్, కక్కిరాల పాండు, ఉప్పల శేఖర్, పోడూరి దూరి శ్రీను, వ్యాపారస్తులు మానేపల్లి బాలసుబ్రమణ్యం, కంచర్ల బాలకృష్ణ, రాము, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



జంగారెడ్డిగూడెంలో నినాదాలు చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్లో ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో రమణ మాట్లాడారు. విదేశీ బహుళజాతి కంపెనీలు భారత్ నుంచి వైదొలగాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు కొనే ఎరువులు పురుగుల మందులు విత్తనాలు వ్యవసాయ పరికరాలు అన్నింటికీ ప్రభుత్వం ధరలు నిర్ణయిస్తుంటే రైతు పండించిన పంటకు ఎందుకు గిట్టుబాటు ధర చట్టం చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గంపల శ్రీను, మద్దిపాటి లక్ష్మయ్య, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయండి

చింతలపూడి: వ్యవసాయ వినాశకర బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద శుక్రవారం వారు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేషు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు డి.రంగనాథ్, ఎస్ సూర్యకుమార్, కె గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యతిరేక బిల్లు ఉపసంహరించుకోవాలి

కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై వినాశకర వ్యవసాయ బిల్లులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. స్థానిక చొతన సెంటర్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ, ముఠావర్కర్ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



షేక్ అక్బర్

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాస్తోందని స్థానిక బిలాల్ మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ అక్బర్ ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు చట్టం బిల్లు ద్వారా వక్ఫ్‌బోర్డు అధికారాలను తగ్గించారని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు అధికారాలను కుదించడం ద్వారా ముస్లిం సమాజానికి చెందిన ఆస్తులపై పెత్తనం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లు అమలులోకి వస్తే వక్ఫ్‌బోర్డు నామమాత్రంగా మారి, ఆస్తులపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన సమారు 9 లక్షల ఎకరాల భూమి బాధ్యతను కలెక్టర్‌కు అప్పగించడం అంటే భవిష్యత్తులో సదరు భూములు అన్యాక్రాంతం అవడానికి అవకాశమిచ్చినట్లేనని వివరించారు. ముస్లిం సమాజం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే.. ముస్లిం ఓట్లతో గద్దెనెక్కిన టీడీపీ బిల్లుకు వంత పాడటం శోచనీయమని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని అక్బర్ డిమాండ్ చేశారు.

ఏపీ మాలమహానాడు ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ



వెంకటరమణ

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఉపాధ్యక్షుడిగా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన లక్కాబత్తుల వెంకటరమణను నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు తెలిపారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న దళితులకు అండగాఉంటూ న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. దళితుల సమస్యల పరి ష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

రామసింగవరంలో కూలిన ఇంటి గోడ



రామసింగవరంలో కూలిన పెంకుటింటి గోడ



గోడ కూలిన ఇంట్లో కూర్చున్న వృద్ధురాలు నరసమ్మ

ద్వారకాతిరుమల: భారీ వర్షాలకు మండలంలోని రామసింగవరంలో దెబ్బతిన్న ఒక ఇంటి గోడ శుక్రవారం మధ్యాహ్నం కుప్పకూలింది. రామసింగవరానికి గ్రామానికి చెందిన మానుకొండ నరసమ్మ పెంకిటింటి గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఒక గోడ బీటలు వారి, శబ్దాలు రావడంతో నరసమ్మ, ఆమె మనుమరాలు భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీయబోయారు. ఇంతలో ఇంటి గోడ బయట పక్కకు కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినట్టు గ్రామస్తులు చెబుతున్నారు.

డ్రెయిన్లలో పూడికతీత చేపట్టండి



గంగన్నగూడెంలో ఎంపీపీ వద్ద సమస్యలు తెలుపుతున్న ప్రజలు

కొయ్యలగూడెం: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా డ్రెయిన్లలో పూడిక తీయించాలని ఎంపీపీ గంజిమాల రామారావు పంచాయతీ అధికారులను కోరారు. శుక్రవారం గంగన్నగూడెం, తిమ్మన్నకుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు. గంగన్నగూడెం గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. స్థానికులు మంచి నీటి బోరు నిర్మించాలని కోరగా మండల పరిషత్ నిధులతో బోరు నిర్మిస్తామని రామారావు వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద డ్రెయిన్ నీరు నిలిచి పోయి దోమల బాధ ఎక్కువైందని స్థానికులు చెప్పడంతో యర్రంపేట గ్రామ కార్యదర్శి నజీర్ అహ్మద్‌కి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల లక్ష్మణరావు (పెద్ద అబ్బులు) చవల వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



పోలవరం రూరల్ : ఏటిగట్టు సెంటర్‌లో మాట్లాడుతున్న రామారావు



కుక్కునూరు : నృత్యం చేస్తున్న చిన్నారులు



టి.నరసాపురం : బహుమతుల ప్రదానం

చింతలపూడి: 500 జనాభా ఉన్న తండాల ను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని ఎస్టీ బంజారా సుగాలి (లంబాడా) సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వెంకటాపు రం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జె.వెంకటేశ్వరరావు, హెచ్ కోటేశ్వర్రావులు ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు డి.కీమ్యానాయక్, డి.రాజబాబు నాయక్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణమూర్తి నాయక్ మాట్లాడారు.

పోలవరంలో భారీ ప్రదర్శన

పోలవరం రూరల్: ఏజెన్సీ గిరిజన సంఘం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పోలవరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ అడవులను, కొండలను సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు సవలం రాంబాబు పాల్గొన్నారు.

బంజారా బజరంగీ భేరి ఆధ్వర్యంలో..

టి.నరసాపురం: బంజారా బజరంగీ భేరి ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో గిరిజన పతాకాన్ని మండల నాయకుడు భూక్యా బిగనాథం ఆవిష్కరించారు. గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాల మర్రిగూడెంలో విద్యార్థులకు గిరిజన, జానపద పాటలు, నృత్యాల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు, సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్, జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పోలవరంను గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.

ఆదివాసీ దినోత్సవం

వేలేరుపాడు: వేలేరుపాడు మండల కేంద్రంలో ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో భూదేవిపేట నుండి వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్ జెండా ఆవిష్కరణ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఏటీపీ డివిజన్ అధ్యక్షుడు ఇరప సూర్యచంద్రం, పీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, ఏపీ ఏజీఎస్ జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు. జీఎస్పీ (గిరిజన సంక్షేమ పరిషత్) జిల్లా నాయకులు బందం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆటోసెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఆసి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఏలూరు జిల్లా నాయకులు సిరికొండ రామారావు మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కుంజా రామయ్య, కన్నయ్య పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాలను సమర్థవంతంగా అమలు చేయా లని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరసం జీవరావు అన్నారు. కుకునూరులో చిన్నారులు రేలా డ్యాన్సులతో అలరించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆదివాసి జెండాను ఎగరవేశారు. సీపీఐ ఆధ్వర్యంలో కుక్కునూరు, బర్కెట్‌నగర్‌లో గిరిజన సంఘం నాయకుడు వర్షా, పాపారావు జెండా ఆవిష్కరణ చేశారు.

ఆ సంస్థలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

బుట్టాయగూడెం: కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా ఆదివాసీలు ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ పిలుపునిచ్చారు. బుట్టాయగూడెంలో ఆసంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ పెట్టి సుబ్బన్న అధ్యక్షతన నిర్వహించారు. తొలిత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పులిరామన్నగూడెం టీడబ్ల్యూ స్కూల్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు.

- జీలుగుమిల్లిలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ నాయకులు ఎస్‌కె గౌసు మాట్లాడారు.

కుంకుళ్లమ్మకు కుంకుమ పూజలు



కుంకుళ్లమ్మ వారు

ద్వారకాతిరుమల: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలుచేశారు. యాగశాలలో అర్చ కులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడు మ చండీ హోమం నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నూకాలమ్మకు పసుపు కొమ్ముల అలంకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ వారు శ్రావణ మాసం, మొదటి శుక్రవారం సందర్భంగా లక్ష పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కళ్యాణకళా వేదిక వద్ద ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మ వారి వెండి చీర తయారీకి స్థానిక చిటికెన రాంబాబు 25 తులాల వెండి, గద్దే పార్థ సారథి 10 తులాల వెండి అందజేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

- శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మొదటి శుక్రవారం స్థానిక విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆగస్టు 15న చండీహోమం, 19న అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పంచమి వేడుకలు

కొయ్యలగూడెం: గరుడ, నాగ పంచమి వేడుకలు మండల వ్యాప్తంగా ఉన్న వైష్ణవ, నాగదేవతాలయాల్లో నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. నాగదేవతలు, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల వద్ద భక్తులు క్షీరాభిషేకాలు చేశారు.